
# వాడనిపువ్వు

'అరవింద'



వారం రోజులనుంచీ ఆ ఊళ్లో జ్ఞానానందస్వామి వారి పేరు, ప్రతిభ, వేదాంతోపన్యాస విశేషాలు వేనోళ్ల కొనియాడబడుతున్నాయి. ఆయన ఆ ఊరికి వేంచేసి వారం రోజులయింది. ఈవేళ ఆఖరి రోజు ఉపన్యాసాలకి. రేపు ఈ ఊరు విడిచి వెళ్లిపోతా రాయన.

ఈ వారం రోజులనుంచి రాజ్యలక్ష్మికి తీరుబడి లేదు. మొదటి రోజు పక్క ఇంటి కామాక్షిగారు రమ్మని బలవంతం చేస్తే వెళ్లింది. మరునాటినుంచి తనంతట తనే అయస్కాంతం ఆకర్షించిన ఇనుము లాగ ఆలయానికి వెడుతూంది. రెండు పూటలా స్నానం చేసి, పళ్ళ తీసుకెడు తూంది. దూరం నుంచే ఆయన్ని చూస్తూంది. ఆయన చెప్పేదికూడా వినటం లేదు. చూస్తూంటేనే మన సాక వి్రభమానికి లోనౌతూంది.

ఈ వేళ ఆఖరి రోజు. మనసు ఇన్నాళ్ళూ లేని ఆలోచనలో పడింది ఈ వేళ— కర్తవ్యమేమిటో తెలియనిదాని లాగ!

పళ్లెంలో పళ్ళ అమర్చుకుని వెళ్ల డానికి సిద్ధమవుతూంది రాజ్యలక్ష్మి.

"వదినా! ఎప్పుడూ లేదు. మరీ అంత పిచ్చేమిటి నీకూ!" అంది కస్తూరి, బుజ్జికి తల దువ్వుతూ.

వదిన వారం రోజులనుంచీ ఇంటి సంగతులు పట్టించుకోవటం లేదు.

కస్తూరి మాటలకి రాజ్యలక్ష్మి తలా, నడుమూ వెనక్కి వంచి సున్నితంగా విరగబడి నవ్వుతూ అంది:

"నీకు తెలియదు, కస్తూరీ! ఈయన . . . ఈ మహాత్ముణ్ణి చూసి నా జన్మ తరించింది. ఇంత ఆనందం నా జన్మలో నేను ఎప్పుడూ పొందలేదు."

మీద నవ్వు వెలుగుని పులుముకుంటున్నారు.

కృష్ణమూర్తి భార్యని పరికించి చూశాడు.

"కస్తూరి చిన్నపిల్ల. దాని కేమీ తెలియదు. నీకు నా మీద కోపం. కోపం ఎంత కక్ష! నువ్వు రాక్షసివి."

"ప్రతి మనిషిలోనూ దేవుడూ, దెయ్యం ఉంటారు. మనం దేన్ని ప్రేరేపిస్తే అదే పలుకుతుంది" అంది రాజ్యలక్ష్మి.

"ఛీ! నీకు సిగ్గు లేదు. నిన్ను నమ్మాను నేను. నీ నవ్వు. . . మోసపోయాను. మనస్ఫూర్తిగా నా స్వేచ్ఛని అంగీకరించా వనుకున్నాను. ఎంత ద్రోహం! ఈ ఇంట్లో నీకు స్థానం లేదు. వెళ్లిపో!" అరిచాడు.

"అరవకండి ఊరికే. నేను ఎక్కడికీ వెళ్లను. మీ భార్యగా నాకు అన్ని హక్కులూ ఉన్నాయి" అంది రాజ్యలక్ష్మి తొణకకుండా.

"కస్తూరీ. . ." గర్జించి పిలిచాడు కృష్ణమూర్తి. చెయ్యి కడిగేసుకున్నాడు.

పక్కనే తలుపు చాటునుంచి సంభాషణ వింటున్న కస్తూరి వణికిపోతూ ఇవతలికి వచ్చింది.

"ఇంక నీకు ఈ ఇంట్లో చోటు లేదు. పో. . . ఎక్కడికి పోతావో. నీకు కావలసిన డబ్బుతీసుకుని వెళ్ళు." కఠినంగా శాసిస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

'పదివ రూపం ఇదా? కళ్లు మూసుకుపోయిన నాకు జరుగుతున్నది అర్థం కాలేదు.' కస్తూరి కూలబడి ఏడుస్తూంది. మోకాళ్లలో తల దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తూంది.

'ఎక్కడికి వెడతాను! ఎవ రున్నారు నాకు!' అనుకుంటూంది.


రాజ్యలక్ష్మి కృష్ణమూర్తిని, కస్తూరిని మార్చి మార్చి చూస్తూంది.

"ఎక్కడికైనా సరే. . . ఏ అనాథ శరణాలయానికో. . ." అన్నాడు కృష్ణమూర్తి కర్కశంగా—

రాజ్యలక్ష్మి చూపుల్లోంచి తిరస్కారం దూసుకుని వచ్చింది. "హుం! మగవాడు!" అంది నవ్వుతూనే.

కస్తూరి దగ్గిరగా వెళ్లింది. భుజాల చుట్టూ చేతులు వేసింది.

"ఏడవకు, కస్తూరీ! ఊరుకో. నేను బ్రతికి ఉండగా నీకు అన్యాయం జరగదు. నువ్వు దుఃఖించటానికి వీల్లేదు. అవును. నేను ప్రతీకారం తీసుకున్నాను. చూడు, చెల్లెలికి ఈ గతి పట్టిందని పాపం, ఎంత బాధ పడుతున్నారో! పరువు పోతుందని అంతకంటె బాధగా ఉంది, పాపం. ఈ మనిషికి బాధ అంటే



**సెంట్ జోసఫ్ చర్చి (తిరుచి)**

**ఫోటో—వి. జయరాజ్ (తిరుచి-8)**

ఏమిటో కొంచెం తెలిసినా చాలు నాకు. ప్రతీకారం జరిగినట్టే. కానీ, నీ మీద నాకు కోపం లేదు, కస్తూరీ. నీకు అపకారంకూడా తలపెట్టను నేను. జీవితమంటే ఏమిటో తెలుసుకున్నాను. నువ్వు తప్పేమీ చెయ్యలేదు—"

కస్తూరి ఏడుపులాపి ఆశ్చర్యంగా వింటూంది.

"ఇంక భయపడవలసింది నలుగురూ ఏమంటారు అనేకదూ? వీళ్ల కళ్లూ, నోళ్లూ ముయ్యటం ఎంతసేపు! అర్ధ సంవత్సరం దేశాటనం చేసి వద్దాం. ఆ పిల్లాడు నా పిల్లవాడుగానే పెరుగుతాడు. నిజానికి కన్నందుకు వాడికి తల్లివి నువ్వు. బాధ్యత నేను వహిస్తాను. తండ్రిని నేను. స్త్రీకి తనను ప్రేమించగల పురుషుడు లేకపోతే తను ప్రేమించేటందుకు కొడుకు. . . పిల్లలు కావాలి. కానీ, వాళ్లమీద . . . వాళ్లు నిన్ను ప్రేమించాలని ఆశ పెట్టుకోకూడదు, కస్తూరీ! లే. ఇంక ఏడవకు" అంది, చెయ్యి పుచ్చుకుని లేవదీస్తూ.

రాజ్యలక్ష్మి మళ్లీ నవ్వింది కృష్ణమూర్తిని చూసి. ఆవిడ చెవుల కున్న వజ్రాల దుద్దులు, బేసరి తళుక్కుమని మెరిశాయి.

•

వారం తిరక్కుండానే రాజ్యలక్ష్మి, కస్తూరి తీర్థయాత్రలకి వెళ్లారు. డబ్బు వ్యవహారాలు చూడటానికి ఒక చుట్టపాయన్ని గుమాస్తాగా కుదిర్చింది. భార్యా, చెల్లెలూ వెళ్లిన మరునాడు కృష్ణమూర్తి గోదావరి స్నానానికి వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదు. అతడు చచ్చిపోయాడని కబురు వెళ్లింది రాజ్యలక్ష్మికి. వెంటనే రాలేదు రాజ్యలక్ష్మి. భర్త శవం కనిపించలేదని బొట్టు చెరపడానికి తిరస్కరించింది. మళ్లీ రెండు నెలల పిల్లవాడిని తీసుకుని ఆ ఊరికి తిరిగి వచ్చారు. అది పన్నెండేళ్ల క్రిందట!

• • •

పన్నెండేళ్ల క్రిందట గోదావరిలో మునిగిపోయిన కృష్ణమూర్తి కాలంలో ఈది ఇప్పుడు ఈ విధంగా పైకి తేలాడు. ఈ స్వామీజీ రూపంలో తన కళ్ల ఎదుట ఉన్నాడు. చూడగానే అతడిని గుర్తుపట్టింది. ఎందుకు గుర్తుపట్టలేదూ? అతడు తన భర్త—ప్రేమించినా, పగపట్టినా! అతడు రేపు వెళ్లిపోతాడు. ఇల్లాగ వెళ్లిపోనివ్వటమేనా? మనసు విభ్రమానికి లోనవుతూంది. ఆ పుట్టుమచ్చని చూస్తూంటే పాత బంధం, కనపడని బంధం మనసులో మెదులుతూంది. ఏదో అసంపూర్తిగా మిగిలిపోయిన ట్లనిపిస్తూంది.

భజన పూర్తి అయింది. స్వామీజీ కళ్లు తెరిచారు. ఆయన దర్శనం కోరిన వాళ్లు ఒక వరసలో వెళ్లి ఆయన పాదాలకు నమస్కరించి వెళ్లిపోతున్నారు. స్వామీజీ వాళ్లని ఆశీర్వదిస్తున్నారు.

చటుక్కున తెలివి వచ్చినట్లయింది రాజ్యలక్ష్మికి. చుట్టూ చూసింది.

ఎంతమంది జనం! అతడికి ఎంత పేరు! ఎంత జరుగుబాటు!

'మీ ఈ స్థితికి, గతికి నేనే కారణం!' గర్వంగా అనుకుంది.

తనకి అతడిమీద మమకారం లేదు. అతడూ అన్నీ తెంచుకుని ఇంతవాడయ్యాడు! ఇంకేం కావాలి? ఈ బ్రతుకులకి ఇదే ముగింపు.

నిశ్చలమైన మనసుతో ముందుకు నడిచింది రాజ్యలక్ష్మి. పాదాలు తాకి నమస్కరించినప్పుడు రాజ్యలక్ష్మిని ఆశీర్వదించారు స్వామీజీ. అందరిలాగా ముందుకి కదలలేదు. నిలబడిపోయిందామె! స్వామీజీ తల ఎత్తి చూశారు.

"నువ్వా!" అన్నారు.

రాజ్యలక్ష్మి మొహంలోకి నవ్వు వచ్చింది.

"ఆఁ నేనే. సెలవు. మీరు ధన్యులయ్యారు. నేనుకూడా ధన్యురాలినే" అని ముందుకు నడిచింది.

ఇంటిమొహం పట్టింది. విసవిసా నడుస్తూంది. వజ్రాల దుద్దులు, బేసరి తళుకుమంటున్నాయి. పెదిమల మీద చిరునవ్వు వెలిగిపోతూంది.

'బుజ్జి కోవాకజ్జికాయలు చేసి పెట్టమన్నాడు.'

వాడు గుర్తు వచ్చి ఇంటివైపు గబగబా నడిచింది. ★